# పులిదేవి

దండకారణ్యంలో పెద్ద పులి హుందాగా నడుస్తోంది. దాన్ని అల్లంత దూరంలో చూసిన లేళ్లూ, జింకలూ పొదల్లోకి పోయి దాక్కుంటున్నాయి.

పులి ముక్కు పీల్చి ,వాసన పసిగట్టి నవ్వుకుంటూ ఠీవిగా నడుస్తోంది. పక్క పొదల్లో ఏవేవి దాక్కున్నాయో అది పసిగట్టింది.

అందుకే పులి నవ్వుకుంది.



నడుస్తూ ఒక్కసారిగా ఆగింది. ముక్కు పీల్చింది.

నరవాసన!

జాగ్రత్తగా ఉండాలనుకుంది. నరులు మా చెడ్డ దుర్మార్గులనుకుంది.

ఒకనాడు ఈ మధ్యనే ఒకడు తుపాకీని తన మీద గురిపెట్టి కాల్చడం పులి ఇంకా మరిచిపోలేదు. తుపాకీ గుండు దాని తొడను రాసుకుపోయింది. గురిపెట్టిన తుపాకీని చూసి గబుక్కున పక్కకు తప్పుకోవడం వల్లే ఆ రోజున ప్రాణాపాయం నుంచి తప్పించుకోగలిగానని అనుకుంది. అయినా కొద్దిపాటి గాయం అయింది. అదింకా పూర్తిగా మాననే లేదు.

ఇప్పుడొచ్చిన నరవాసన వాడిదే అయ్యి ఉంటుందని పులి అనుకుంది. పొదల పక్కన నక్కి నక్కి వెళ్తోంది. వాడే వీడు అయ్యుంటే ప్రతికారం తీర్చుకోవలసిందే అని గట్టిగా అనుకుంది.

పొదల పక్కనే నక్కి నక్కి నడుస్తోన్న పులిని వాసన పట్టిన లేళ్లూ, జింకలూ మరింత మెల్లిగా చప్పుడు కాకుండా నడిచాయి.

పులి నెమ్మదిగా నరవాసన వస్తున్న వైపుకు వెళ్లి, వీడేవాడు అని గ్రహించి ఒక్కసారిగా పిడుగుపడ్డట్టు పంజా విసిరింది. వాడికి తుపాకీ పేల్చే అవకాశమే ఇవ్వలేదు. 'ఢాం' అని తుపాకీ పేలుద్దామనుకున్న వాడు కెవ్వున కేకేస్తూ పడిపోయాడు. పులి విజయోత్సాహంతో గాండ్రించింది. వాడి పళ్లతో వాడిని చీల్చి, నాలుక చాచి రక్తం పీల్చింది.

అంతలో చెట్టుపై మరొకడున్నట్టు గ్రహించి ముందు కాళ్లు రెండూ నేలను నొక్కిపట్టి, ఒక్క ఉరుకు ఉరికి, పొదల చాటుకెళ్లి మాయమయ్యింది.

అరణ్యంలో ఆ పులికి నక్కజిత్తులు తెలుసు, కుక్క మొరుగులూ తెలుసు. ఆహారం కోసం మాటు వెయ్యడమూ తెలుసు. శత్రువు దొంగ ఎత్తుల్ని చిత్తు చేయడమూ తెలుసు.

అలాంటి పులి ఓ రోజున పొరపాటున జనారణ్యంలోకొచ్చింది. నెహ్రూ జూలాజికల్ పార్కు వారికి చిక్కింది. బోనులో పడింది. వాళ్లు పెట్టే ఆహారం తింటూ తన సహజ ప్రతిభా పాటవాలను నెమ్మదిగా కోల్పోయింది. కొన్నాళ్లకు కొందరు దుండగుల ఉచ్చులో పడి గిలగిలా తన్నుకు చచ్చిపోయింది. తన

చర్మం అంత ఖరీదు చేస్తుందని ఆ పులికీ తెలీదు. అందుకోసమే తనను చంపి తన చర్మాన్ని వలుచుకుని పోయారనీ తెలీదు.

ఆ పులి పేరు సాకీ!

చంబల్ లోయలో తుపాకీ కాల్పులు ప్రతిధ్వనించాయి. తనను అవమానించిన ఠాకూర్లను ఆమె మరచిపోలేదు. తనను బలవంతంగా అనుభవించిన వాళ్లను మరచిపోలేదు.

అప్పుడు ఆమెకు తన వాళ్లెవరో పరాయి వాళ్లెవరో బాగా ఎరుగును. శత్రువు ఎప్పుడు ఎలా తనను దెబ్బతీయాలని కాచుకుకూచున్నాడో ఎరుగును. శత్రువును ఏ రోజున ఏ విధంగా మట్టికరిపించాలో ఎరుగును.

అందుకే ఆమె తనను వివస్త్రను చేసి ఎన్ని విధాలుగా అవమానించారో అలాగే వారినీ చేసి ప్రతీకారం తీర్చుకోగలిగింది. ఇరవై మంది ఠాకూర్లనూ హింసించి తన కాళ్లు పట్టుకుని బతిమాలేలాగ చేసి కాల్చి చంపింది.

ఆమె పూలన్‌దేవి! మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి లొంగిపోయింది. పదకొండేళ్ల పాటు జైలు శిక్ష అనుభవించింది. ఏ పేద దళిత కుటుంబం నుంచి వచ్చిందో అలాంటి దళితుల అభ్యున్నతికి పాటు పడాలనుకుంది. ఎన్నికల్లో పోటీచేసి పార్లమెంటు సభ్యురాలిగా ఎన్నికయ్యింది. దళితుల అభిమానురాలయ్యింది.

ఎమ్మెల్యే ఉదంసింగ్‌ను పెళ్లి చేసుకుంది. అందరిలానే జీవించాలనుకుంది. బౌద్ధ మతం తీసుకుని అహింసయే పరమ ధర్మమని నమ్మింది. తనపై తీసిన సినిమా 'బండిట్ క్వీన్' దేశ విదేశాల్లో విజయవంతంగా ఆడినా కొన్ని అభ్యంతరకర సన్నివేశాలున్నాయని కోర్టు కెక్కింది. ఆ నిర్మాతలు పెద్ద మొత్తంలో సొమ్ము ఇస్తే పెట్టిన కేసును వాపసు చేసుకుంది. ఢిల్లీలో ఓ బంగ్లాను కొని సొంత ఇంటిదయ్యింది.

బందిపోటుగా ఉన్నప్పుడు తీసుకున్న జాగ్రత్తలు ప్రజాస్వామ్యవాది అయ్యాక అనవసరం అనుకుందేమో. ప్రభుత్వం ఇచ్చిన 'సెక్యూరిటీ' చాలనుకుంది. దళితుల సంక్షేమానికి నిర్దేశించుకున్న గమ్యం చేరకుండానే దేశ రాజధానిలో, అదీ పార్లమెంటు భవనానికి కిలోమీటర్ దూరంలోనే దుండగుల కాల్పులకు గురువారం బలయ్యింది. ఆమె భౌతిక కాయం ముందు ఆమె భర్త ఉదంసింగ్ విలపించినప్పటి ఫొటోలు పత్రికల్లో వచ్చాయి.

ఆ పులి సాకీ చావుకు కారణం దాని చర్మం అమ్మగా వచ్చే లక్షల రూపాయలు!

మరి పూలన్‌దేవి హత్యకు కారణం ఆమెకున్న కాస్తో కూస్తో ఆస్తియేనా? ఆ ఆస్తి కోసం భర్త ఉధంసింగే చంపించి ఉంటాడని కొన్ని పత్రికలు రాశాయి. ఉత్తరప్రదేశ్‌లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పూలన్‌దేవి కనుక ప్రచారం చేస్తే తమ సీట్లు గోవిందా అని భయపడుతున్న వాళ్లే ఈ కుట్ర పన్నారని సమాజ్‌వాద్ పార్టీ నాయకుడు ములాయంసింగ్ ఆరోపించాడు. పూలన్‌దేవి ఉధంసింగ్‌కు రెండో భార్య అని అందరికీ తెలిసిందే. అతనికి మొదటి భార్య వలన పిల్లలున్నారనీ ఎరిగిందే. ఒకవేళ పూలన్‌దేవి శత్రుశేషం ఠాకూర్లే ఆమెను పొట్టనపెట్టుకున్నారేమో...నిజాలు నిలకడ మీద తెలుస్తాయి.

ఈ జనారణ్యంలో, మేడిపండు ప్రజాస్వామ్యంలో ఎప్పుడు ఎలాంటి అకృత్యం ఎవరు చేసినా ఆశ్చర్యం లేదు.

ఇది నిజాయితీ మీసాలు తీసేసిన మోసాల ప్రపంచం. ఆసరా అనుకున్న వారే ఆలింగనం చేసుకుని పైసల కోసం ప్రాణాలు తీసే ధూర్త లోకం!

వార్త దినపత్రిక, 27-7-2001